
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
సోమవారం 10 ఫిబ్రవరి 2025




ప్రాచీన పద్ధతిలో..

- శ్రీశైలంలో ఆలయ పైకప్పు మరమ్మతు పనులు
- రూ.3 కోట్ల అంచనాతో త్వరలో ప్రారంభం
- నేడు మంత్రుల సమక్షంలో ఒప్పందం

నంద్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఆలయాలతో పాటు ప్రాంగణంలోని పరివార ఆలయాల్లో సైతం చాలా చోట్ల పైకప్పు దెబ్బతిన్నది. నీటి లీకేజీలతో ఈ సమస్య ఏర్పడింది. ఈ పరిణామం ఇటు ఆలయ అధికారులను, భక్తులను కలవరపరిచింది. ప్రాచీన ఆలయానికి మరమ్మతు పనులు ఆధునిక పద్ధతిలో చేపడితే ప్రాచీనతకు భంగం వాటిల్లుతుంది. భారతీయ ప్రాచీన నిర్మాణ పద్ధతులు అనుసరించి మరమ్మతులు చేయాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు గత ఏడాదిలో పూణేకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ వారిని సదరు పనులు చేయాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన సదరు ట్రస్ట్ సభ్యులు గత ఏడాది అక్టోబరు 2వ తేదీన మరమ్మతు చేయాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. చేయాల్సిన పనులు తదితర అంశాలపై ఆలయ అధికారులతో మాట్లాడి వెళ్లారు. తాజాగా సదరు సంస్థ పనులు చేపట్టేందుకు ముందుకొచ్చింది. సుమారు రూ.3 కోట్లతో స్వచ్ఛందంగా శాస్త్రీయ పద్ధతుల్లో పనులు చేపట్టనున్నారు. ఈ సంస్థ గతంలో వివిధ దేవాలయాల్లో ఈ తరహా పనులు చేపట్టింది.





లడ్డు పోటు మండపం

నేడు మంత్రుల సమక్షంలో ఒప్పందం

శ్రీశైలంలో సోమవారం మంత్రుల సమక్షంలో సదరు సంస్థ పనులు చేసేందుకు తగిన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకోనుంది. 3,17,988 చదరపు అడుగులు విస్తీర్ణం కలిగిన ఈ ఆలయ ప్రాంగణంలో వేల సంవత్సరాల నాటి పురాతన మండపాలకు, ఆలయాలకు సదరు సంస్థ మరమ్మతులు చేసేందుకు ఒప్పుకుంది. ఆలయ అధికారులు కోరడం.. సంస్థ సభ్యులు వెంటనే పరిశీలించి పనులు చేస్తామని ముందుకు రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



సహస్ర దీపారాధన మండపం

ప్రాచీన పద్ధతిలో ఇలా...

శాస్త్రీయ పద్ధతిలో మరమ్మతులు చేయాలంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. వెయ్యేళ్ల క్రితం నిర్మాణాలు జరిగిన పద్ధతిలోనే ఒక మిశ్రమం తయారు చేస్తారు. సున్నం, బెల్లం, కరక్కాయ పొడి, కాల్చిన మట్టి, ఇటుక ముక్కలు, ఇటుకల పొడితో పాటు అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న బంక (ఆ ప్రాంతపు చెట్ల నుంచి సేకరించేది) వాడుతారు. వేర్వేరు డ్రమ్ముల్లో వీటిని దాదాపు కొన్ని రోజుల పాటు నానబెట్టుకున్నాక సమపాళ్లలో ఇసుకతో కలిపి ఒక మిశ్రమం సిద్ధం చేసుకుంటారు. ఆపై మరమ్మతులు ఉన్న చోట ఆ మిశ్రమాన్ని ఒక క్రమపద్ధతిలో ప్లాస్టింగ్ చేసుకుంటూ వెళ్తారు.

శివరాత్రి తరువాత పనులు ప్రారంభం

పూణేకు చెందిన ఓ సంస్థ నేడు ఒప్పందం ప్రక్రియ చేసుకోనుంది. ఇప్పటికే సదరు సంస్థ సింహాచలం దేవాలయంలో పనులు చేస్తున్నారు. ఇక్కడ శివరాత్రి బ్రహ్మోత్సవాలు పూర్తయిన తర్వాత మార్చి 2వ తేదీ నుంచి శ్రీశైలంలో పనులు ప్రారంభిస్తారు. శాస్త్రీయ పద్ధతుల్లో మరమ్మతు పనులు చేపడితే ఆలయ ప్రాచీనతకు ఎలాంటి భంగం కలగకుండా ఉంటుంది.

- నరసింహారెడ్డి, ఈఈ, శ్రీశైలం



లడ్డు పోటు దేవాలయం వెనుక ఉన్న శివాలయాలు



వీర శిరోమండపం

నేడు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సీసీ కెమెరాల నిఘాతో నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించేందుకు ఆయా సెంటర్లను సన్నద్ధం చేశారు. ప్రభుత్వం పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. నంద్యాల జిల్లాలో 35 సెంటర్లలో మొత్తం ఎనిమిది వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎంపీసీ 5000 మంది, బైపీసీ మూడు మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొననున్నారు. వెబ్‌కాస్టింగ్ విధానంలో అధికారులు పరీక్షలను పర్యవేక్షించనున్నారు.

ఎగ్జామినర్లకు మూడు రోజులు మాత్రమే విధులు

35 సెంటర్లను నియమించనున్న ఎగ్జామినర్లు ఆయా సెంటర్‌లలో మూడు రోజులు మాత్రమే విధులు నిర్వహించనున్నారు. ఆ తర్వాత మరో ఎగ్జామినర్‌ను నియమించనున్నారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

మాస్ కాపీ యింగ్‌కు పాల్పడితే చర్యలు

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ పాల్పడితే చర్యలు తప్పవు. నిర్ణీత సమయంలోపే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఎగ్జామినర్, పర్యవేక్షణాధికారులు మినహా ఏ ఒక్కరికీ సెంటర్‌లలోకి అనుమతి ఉండదు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. అలాగే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కల్పించినా కేంద్రాలను రద్దు చేస్తాం. ఎగ్జామినర్ లను ఇంటర్‌బోర్డు నిర్ణయిస్తుంది.

- సునీత, డీఐఈవో, నంద్యాల జిల్లా

సీసీ కెమెరాల నిఘా మధ్య నిర్వహణ



రోడ్డు టెర్రర్..!

- నెత్తురోడుతున్న రహదారులు
- ఏటా పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని రవాణా, పోలీసు శాఖలు
- తూతూ మంత్రంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. నిత్యం ఏదో ఒక రోడ్డులో మృత్యు ఘంటికలు మోగుతూనే ఉన్నాయి. రహదారి ప్రమాదాలను నివారించడంలో అటు రవాణా, ఇటు పోలీసు శాఖల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాఠశాల, కళాశాల విద్యార్థులకు, ఆర్టీసీ, ఆటో, లారీ, ఇతర వాహనడ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహించకపోవడం వల్లే ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నట్లు తెలుస్తోంది. రవాణా శాఖ అధికారులు బ్లాక్ స్పాట్లు గుర్తించి ఆ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదికలు సమర్పిస్తున్నా ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల అథారిటీ, మున్సిపల్ అధికారులు మాత్రం స్పందించడం లేదు.

● ఓవర్ స్పీడ్, అవగాహన లేనితనం

ఇటీవల కోడుమూరు రహదారిలో జరిగిన ఓ ఘటనలో ఒకరు, మరో ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ రెండు ప్రమాదల్లో వారి స్పీడును పరిశీలిస్తే 140 కి.మీ. వేగంతో వెళ్తున్నట్లు తెలిసింది. అలాగే రోడ్డుపై సరైన అవగాహన లేక ఓవర్‌టెక్ చేయబోయి ప్రమాదానికి గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను గమనిస్తే ప్రతి ప్రమాదం కూడా డ్రైవర్ నిర్లక్ష్యమని అధికారుల విశ్లేషణలు చెబుతున్నాయి. నిద్రమత్తు, మద్యం సేవించి వాహనాలు నడపటం, దీంతో పాటు సురక్షిత ప్రయాణం ఎలా ఉండాలనే దానిపై అవగాహన లేకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా మానవ తప్పిదాల వలన 95 శాతం ప్రమాదాలు జరుగుతుంటే అందులో డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల 75 శాతం, మరో 25 శాతం రోడ్లు, వాహనాల మరమ్మతుల కారణంగా జరుగుతున్నట్లు పలువురు నిపుణులు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షా 50 వేల మంది మృత్యువాత పడుతుంటే నాలుగు లక్షలకు పైగానే క్షతగాత్రులుగా మారుతున్నారు. మన రాష్ట్రంలో సుమారు ఏటా 12 వేల మంది మృతి చెందుతున్నారు. అలాగే జిల్లాలో ఏటా 500 నుంచి 600 మంది వరకు మృతి చెందుతున్నట్లు, 3 వేల మందికి పైగా గాయాలపాలవుతున్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.



ఆటోలు, బైకుల ప్రయాణం ప్రమాదకరం

ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు గమనిస్తే ఎక్కువ శాతం జిల్లాలో ఎక్కువగా ఆటోలు, బైకుల ప్రమాదాలే ఎక్కువగా ఉన్నాయి. లారీలు యమపాశాలుగా మారాయి.

మిగతా 7వపేజీలో

ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో భాగం కావాలి

- ఆదివాసుల ఉద్యమాలకు మద్దతు ఇద్దాం
- విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ పిలుపు
- ముగిసిన 24వ సాహిత్య పాఠశాల



ప్రసంగిస్తున్న వీక్షణం సంపాదకులు వేణుగోపాల్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో సాహిత్యకారులు భాగం కావాలని విరసం (విప్లవ రచయితల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ పిలుపునిచ్చారు. నగరంలో వెంకటాద్రినగర్‌లోగల వెంకటేశ్వర కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన విరసం 24వ పాఠశాల సాహిత్య పాఠశాల ఆదివారం రాత్రి ముగిసింది. 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన ఈ రెండు రోజుల కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి విరసం నేతలు, సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా విరసం నేతల ప్రసంగాలు ఆలోచనాత్మకంగా సాగాయి. రచయితలు, కవులు, బుద్ధిజీవులు చేయాల్సిన కార్యక్రమాలపై వక్తలు చైతన్యవంతమైన ప్రసంగాలు చేశారు.

మిగతా 7వ పేజీలో

మార్చిలో ఎన్‌హెచ్-167 కే పనులు ప్రారంభం

ఏఈ రవికాంత్ వెల్లడి

కొత్తపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరం నుంచి నంద్యాల వరకు ఎన్‌హెచ్-167కే కింద చేపట్టబోయే జాతీయ రహదారి నిర్మాణ పనులు మార్చి నెలలో ప్రారంభం కానున్నట్లు ఎన్‌హెచ్-167 కే ఏఈ రవికాంత్ వెల్లడించారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సంగమేశ్వరం నుంచి నంద్యాల వరకు 620.279 ఎకరాలు భూసేకరణ కూడా ఇది వరకే పూర్తి చేసి బాధిత రైతాంగానికి నష్టపరిహారం కూడా దశలవారిగా వారి బ్యాంకు ఖాతాలకు జమవుతున్నట్లు తెలిపారు. ఎన్‌హెచ్‌వో కన్వర్షన్ రూ.776.17కోట్లతో 62.571 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పది మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతామని తెలిపారు. టెండర్లు కూడా పూర్తయ్యాయని, అతిత్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆత్మకూరు నుంచి వెలుగోడు వరకు 17.1 కిలోమీటర్ల అటవీ ప్రాంతం కావడంతో ప్రత్యేక ప్యాకేజీ కింద ఈ రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

శ్రీగిరిపై స్వర్ణ రథోత్సవం

స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల స్వర్ణ రథోత్సవం

శ్రీశైలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహా క్షేత్రంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల స్వర్ణ రథోత్సవం వైభవంగా జరిగింది. వేకువ జామున మల్లికార్జున స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథాన్ని నేత్రశోభితంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు స్వర్ణరథానికి కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. గంగాధర మండపం నుండి నంది మండపం వరకు అశేష భక్తజనం నడుమ స్వర్ణ రథోత్సవం జరిగింది. కోలాటం, చెక్కభజన, జానపద కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. సీఐ జి. ప్రసాదరావు, దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుసూదనరెడ్డి పర్యవేక్షించారు.



స్వర్ణ రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు





కోలాటమాడుతున్న చిన్నారులు, మహిళలు

రోడ్డు టెర్రర్..!

(5వ పేజీ తరువాయి)

ఈ ఏడాది జనవరి 23న ఒక్క రోజే ఐదుగురు మృత్యువాత పడ్డారు. కర్నూలులో ఇద్దరు వృద్ధులు మృతి చెందగా ఉల్చాల రోడ్డులో ఓ మహిళ మృతి చెందింది. ఆస్పరి వద్ద ద్విచక్రవాహనం లారీని ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు, పెద్దకడుబూరు సమీపంలో హనుమాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో మరో యువకుడు దుర్మరణం చెందాడు.

- జనవరి 22న మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు, ఒక డ్రైవర్ కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అలాగే మంత్రాలయం సమీపంలో సూగూరు వద్ద ద్విచక్ర వాహనంలో చీర కొంగు ఇరుక్కొని కింద పడి మహిళ మృతి చెందింది.
- జనవరి 18న హుశేనాపురం, ఓర్వకల్లు మధ్యలో ఓ కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు.
- ఈ నెల 19న తుగ్గలి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు.
- కర్నూలు నగరంలో ఈ నెల 13న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. స్పీడ్ బ్రేకరు ఎక్కించబోయి అదుపు తప్పి కింద పడి వంశీకృష్ణ అనే వ్యక్తి మృతి చెందాడు.
- జనవరి 17న కోడుమూరు సమీపంలో కారు బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఐచర్ వాహనం ఢీకొని ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన కోడుమూరు వెళ్లే రహదారిలో ఆందోళన కలిగించింది.
- జనవరి 15న వెల్దుర్తి సమీపంలో జాతీయ రహదారిపై కారు ఢీకొన్న సంఘటనలో చిన్నారి బాలుడు దుర్మరణం చెందాడు.
- గోనెగండ్ల సమీపంలో కారు అదుపు తప్పడంతో కారులో ఉన్న పది మందికి గాయాలయ్యాయి.
- ఈ నెల 6వ తేదీన కోడుమూరు రోడ్డులో కొత్తూరు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడటంతో జయన్న అనే వ్యక్తి మృతి చెందాడు.
- జనవరి 2వ తేదీన కోడుమూరు రహదారిలో కొత్తూరు కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో భార్యభర్తలు రామగోవిందు, వరలక్ష్మి దంపతులు దుర్మరణం చెందారు.
- డిసెంబరు 21వ తేదీన మద్దికెర సమీపంలో ఓ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనం పై నుంచి కింద పడి. జనవరిలో 19న కోలుకోలేక మృతి చెందాడు.

హెల్మెట్ వాడకపోవడంతోనే

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ భాగం బైక్ ప్రమాదాలే ఉన్నాయి. వీరంతా హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రమాదాల్లో మృతి చెందారు. కేవలం సెల్‌ఫోన్‌కు రూ.300లు వెచ్చించి పౌచ్, రక్షణకవచం, ప్రొటెక్షన్ గ్లాస్ వాడుతుంటారు. మన శరీరంలో ముఖ్యమైన శిరస్సుకు రూ.500లు విలువ గల హెల్మెట్ కొని ప్రయాణించడంపై నిర్లక్ష్యం వహిస్తుంటారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 6 లక్షల ద్విచక్ర వాహనదారులు ఉన్నారు. సుమారు వెయ్యి మంది మాత్రమే హెల్మెట్లు వాడుతున్నట్లు తెలుస్తోంది.

కోడుమూరు రహదారిలోనే..

కర్నూలు కోడుమూరు, దేవనకొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు రహదారిలోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గాల్లో సరైన రోడ్డు సూచిక బోర్డులు లేకపోవడం, డివైడర్లు లేకపోవడం, గ్రామాలకు చెందిన వారు బైకులపై వెళ్తుండటం, పోలీసుల తనిఖీలు లేకపోవడం ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కర్నూలు నుంచి కోడుమూరు వరకు వేగవంతమైన ప్రయాణంతో అధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసు లెక్కల్లో చెబుతున్నాయి. గతంలో ఎస్పీలు అప్పుడప్పుడు రహదారి ప్రమాదాల పట్ల విస్తృత అవగాహన కల్పించినా రాను రానూ కింది స్థాయి పోలీసు అధికారులు ప్రమాదాలు నివారించడంలో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది.



సరైన నైపుణ్యం లేకపోవడం వల్లే..

ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ఎక్కువ మంది సరైన నైపుణ్యం, అవగాహన లేకపోవడం వల్లేనని తెలుస్తోంది. కోడుమూరు రహదారిలో అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నది వాస్తవమే. ఇంజనీరింగ్ అధికారులను కూడా సంప్రదించాం. వారు రోడ్ల సమస్య ఏమీ లేదని చెబుతున్నారు. మరో పక్క గమనిస్తే అతివేగమే ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

\- తబ్రేజ్, సీఐ, కోడుమూరు



హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలు

బైక్ ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది మృతి చెందడానికి కారణం హెల్మెట్ లేకపోవడమే. హెల్మెట్ ధరించాలని ద్విచక్రవాహనదారులకు పదేపదే అవగాహనకల్పిస్తున్నాం. వాహనదారుల్లో మార్పులు రావడం లేదు. రోడ్డు ప్రమాదలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. - మన్సూరుద్దీన్, కర్నూలు ట్రాఫిక్ సీఐ

జాతరకు వేళాయే...



మద్దమ్మవ్వ దేవాలయం



గ్రామ దేవత మద్దమ్మవ్వ

- 11 నుంచి మద్దమ్మవ్వ ఉత్సవాలు
- 12న కళ్యాణోత్సవం.. 13న రథోత్సవం

మద్దికెర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత మద్దమ్మవ్వ జాతర ఉత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. మద్దికెరలో వెలసిన గ్రామ దేవత మద్దమ్మవ్వ జాతర పురస్కరించుకుని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదయం అమ్మవారిని పుష్పాలతో అలంకరించి ఆకు పూజ నిర్వహిస్తారు. ఈ నెల 11వ తేదీన మద్దమ్మవ్వకు ప్రత్యేక పూజలు చేస్తారు. 12న బుధవారం రాత్రి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఏర్పాటు చేసి ఊరేగిస్తారు. అదే రోజు రాత్రి 12 గంటలకు అమ్మవారి ఖడ్గానికి కళ్యాణోత్సవాన్ని నిర్వహించి అనంతరం భక్తులు తలంబ్రాలు పోస్తారు. 13వ తేదీ గురువారం మద్దమ్మవ్వకు ప్రత్యేక పూజలు, అమ్మవారికి పుష్పాలంకరణ, ఆకు పూజలు నిర్వహిస్తారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామానికి చెందిన యాదవరాజులను రాజుల దుస్తులతో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకు వస్తారు. 4 గంటలకు రథోత్సవం ముందు హోమం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు యాదవరాజులు రాజు దుస్తులతో ఖడ్గాలు ధరించి ముందుండగా అశేష జనవాహిని మధ్య అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. 14న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు రాతిదూలం పోటీలు ఉంటాయి.

ఆలయ చరిత్ర

ప్రస్తుతం మద్దికెర అని పిలవబడుతున్న గ్రామం ఒకప్పుడు మాధవికెరగా ఉండేది. గ్రామ దేవత అమ్మోరును మాధవి దేవతగా పిలిచేవారు. కాలక్రమేణా పేరు రూపాంతరం చెంది గ్రామాన్ని మద్దికెరగా దేవతను మద్దమ్మవ్వగా పిలుస్తారు. అమ్మోరు ఆలయంలో కన్నడ, తెలుగు భాషల్లోని శిలాశాసనం, అక్షర లిపిని పరిశీలిస్తే కొన్ని విషయాలు స్పష్టమవుతున్నాయి. శాతవాహనుల శకం 1741లో దేవరకొండ రామప్పనాయుడు అనే పాలేగాళ్లు ఈ శాసనాలు రాయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని అతిపెద్ద విగ్రహం మద్దికెరలో వెలసిన మద్దమ్మవ్వ విగ్రహమే. విగ్రహంలో జీవకల ఉట్టిపడుతుంది. ఇంత పెద్ద విగ్రహం రాష్ట్రంలో మరెక్కడా లేదని ప్రతీతి. ఈ విగ్రహాన్ని ప్రతిష్టించలేదని, అక్కడే ఉన్న మద్ది వృక్షాన్ని విగ్రహంగా చెక్కినట్లు శిలాశాసనాలు చెబుతున్నాయి. దేవతా పేరుతోనే పూర్వం మద్దికెరను, మద్దమ్మకుంటను, మద్దమ్మబావిని ఏర్పాటు చేసినట్లు పూర్వీకులు తెలిపారు.

- అన్నదానం: మద్దమ్మ జాతర పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఈ నెల 13న మధ్యాహ్నం గ్రామానికి చెందిన జమేదార్ సంధ్య, జంబునాథ్ రాయుడు, జమేదార్ ఉమామహేశ్వరి శ్రీనివాసుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



గ్రామ దేవత మద్దమ్మవ్వ జాతర నాలుగు రోజుల పాటు వైభవంగా జరుగుతుంది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దేవాలయాన్ని దాతల సహకారంత మరమ్మతులు చేశాం. వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశాం. అమ్మవారికి ప్రత్యేక పూజలు, పుష్పాలంకరణ విశేషంగా జరుగుతాయి.

\- తిమ్మప్ప, పూజారి

చెట్నహళ్లిలో మళ్లీ గొడవ

- శ్మశాన విషయమై మరోసారి ఘర్షణ
- శాంతింపజేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు



శ్మశానం వద్దకు వచ్చిన గ్రామస్థులు

మంత్రాలయం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం చెట్నహళ్లి గ్రామంలో మళ్లీ గొడవ మొదలైంది. శ్మశానం విషయమై మరోసారి ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. రెండు రోజుల కిందట బీసీ, ఎస్సీల మధ్య వివాదం జరిగి 82 మంది మీద కేసు నమోదైన విషయం తెలిసిందే. తిరిగి ఆదివారం దళితుల మధ్య ఘర్షణ జరగడం చర్చనీయాంశంగా మారింది. శనివారం రాత్రి గ్రామంలోని దళిత సామాజిక వర్గానికి చెందిన బుడ్డన్న అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో శ్మశానంలో అంత్యక్రియలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా శ్మశానికి సమీపంలో నివాసం ఉంటున్న దళితుల్లోని మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. తహసీల్దార్ ఎస్.రవి, వీఆర్వో భీముడు, ఎస్ఐ శివాంజల్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి నచ్చజెప్పడంతో శాంతించారు. అనంతరం అక్కడే బుడ్డన్న శవానికి అంత్యక్రియలు చేశారు. 113 సర్వేలోని రస్తా పోరంబోకు భూమిలో గత ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చింది. అక్కడికి సమీపంలోనే శ్మశానం ఉంది. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి వెళ్లినప్పుడల్లా దళితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 125, 12 సర్వే నెంబర్లలో ఉన్న శ్మశాన స్థలంలో పూడ్చుకోవాలని చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మంత్రాలయం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ కపటి నరసింహులు (42) విద్యుదాఘాతంతో శనివారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువుల వివరాల మేరకు.. ఈ నెల 17, 18 తేదీల్లో బంగారమ్మ గ్రామ దేవర మహోత్సవాలకు గ్రామంలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను శుభ్రపరుచుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. కపటి నరసింహులు పొలాలకు పిచికారి చేసే మందును పంపుతో ఇంటిని శుభ్రం చేస్తుండగా.. ఇంటికున్న వైరు చెయ్యికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు మాధవరం ఎస్ఐ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఎమ్మిగనూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాపిల్లలు రోదిస్తున్న దృశ్యం పలువురిని కంట తడి పెట్టించింది.

కవి సమ్మేళనంలో నాగేశ్వరయ్యకు సత్కారం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కవి కేవీ నాగేశ్వరయ్యకు కడపలో నిర్వహించిన సాహిత్య సమావేశంలో సత్కారించుకున్నారు. శనివారం కడప నగరంలోని ఐఎంఏ హాలులో రాయలసీమ రచయితల సంఘం, కడప జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో కేవీ నాగేశ్వరయ్య రాయలసీమ ప్రాంత ఘన చరిత్రను, వైభవాన్ని కవిత్వ రూపంలో వినిపించి, సభికులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మూలా మల్లికార్జునరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే బాబు ఘనంగా సత్కరించారు.



నాగేశ్వరయ్యను సత్కరిస్తున్న సాహిత్య సంస్థ నిర్వాహకులు

ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో భాగం కావాలి



ప్రసంగిస్తున్న వరలక్ష్మి, అరసవిల్లి కృష్ణ, వసంతకుమారి, ఎన్. రవి, మహ్మద్ మియా

(5వ పేజీ తరువాయి)

ఈ సాహిత్య కార్యక్రమాల్లో పలువురు రచయితల పుస్తక ఆవిష్కరణలు జరిగాయి. విప్లవ మేధావి ప్రొఫెసర్ సాయిబాబా స్మృతిపథంలో ప్రొఫెసర్ సాయిబాబా వేదికపై సాగిన ఈ కార్యక్రమంలో ఆదివారం నాగేశ్వర్, రాంకి నేతృత్వంలో 27 పుస్తకాలు ఆవిష్కరించారు. విరసం నాయకురాలు వరలక్ష్మి అధ్యక్షతన 'తెలుగు సాహిత్యంలో వెలుగు నీడలు' అనే అంశంపై విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ నేటి ఫాసిజం సాహిత్య, కళా, మేధోరంగాలపై ప్రభావితం చూపుతోందని, ఎక్కడ ధిక్కార స్వరాలు వినిపించినా తొక్కేసే ధోరణితో ముందుకు పోతోందని చెప్పారు. రచయితలారా మీరు ఎటువైపు అన్న ప్రశ్నలోంచి 1970లో విరసం ఆవిర్భవించి అనేక ఉద్యమ, సంక్షోభ కాలాల్లో తన రచన, ఆచరణలతో ప్రజా పోరాటాల పక్షాన నిలిచిందని గుర్తు చేశారు. పీడిత సమూహాల సమస్యల పరిష్కారానికి అనేక ప్రజాస్వామిక పోరాటాలు ముందుకు వచ్చాయని చెప్పారు. విరసం నాయకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ సాహిత్యకారుల నుంచి ఈ సమాజం ఏమీ ఆశిస్తున్నదీ గుర్తించి రచన చేయాలని అన్నారు. 'విప్లవోద్యమంపై ఫాసిస్టు యుద్ధం - బుద్ధివుల పాత్ర' అనే అంశంపై పాణి మాట్లాడుతూ వనరుల దోపిడీ కోసం రాజ్యం విప్లవోద్యమం మీద యుద్ధం చేస్తున్నదని అన్నారు. దీని వెనుక కార్పొరేట్ శక్తులు ఉన్నాయని అన్నారు. కార్పొరేట్లు బీజేపీని అధికారంలోకి తెచ్చారని, అందుకే మోదీ కార్పొరేట్ల స్నేహితుడయ్యారని అన్నారు. వికసిత భారత్ అంటే కార్పొరేట్ ఇండియా అని అన్నారు. ముగింపులా ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ ప్రజల్లోకి ఫాసిస్టు ప్రమదాన్ని తీసుకపోవడానికి అనేక సృజనాత్మక రూపాలను రచయితలు ఎంచుకోవాలని అన్నారు. ఫాసిస్టు వ్యతిరేకపోరాటంలో సంస్కృతి పాత్ర కీలకం అన్నారు. ఈ రెండు రోజుల సాహిత్య కార్యక్రమాల్లో విరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవేరా, శశికళ, నాగేశ్వరాచారి, అల్లం రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో ప్రగతిశీల కవిత్వాన్ని కవులు చదివి వినిపించారు. అరుణోదయ, ప్రజాకళామండలి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కర్నూలు కవులు, రచయితులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, ఎస్‌డీవీ అజీజ్, ఎస్ఎండీ ఇనాయతుల్లా, గజల్ గాయకుడు మహ్మద్ మియా తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



ఆలయ ప్రాంగణంలో ఎ. శాంతి కుమారి

శ్రీశైలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి ఐఎఎస్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఎ. శాంతి కుమారికి ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఎ. శాంతి కుమారి ఐఏఎస్‌కు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈవో ఎం. శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న 150 మంది అన్నెం కుటుంబ సభ్యులు

అతిపెద్ద 'అన్నెం' కుటుంబం

కర్నూలులో కలుసుకున్న 150 మంది సభ్యులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కుటుంబం అంటే ఆత్మీయతల సమ్మేళనం. అనురాగ బంధాల నందన వనం. ఆదివారం నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని గెలాక్సీ ఫామ్‌హౌస్‌లో అన్నెం కుటుంబ సమ్మేళనం ఉద్వేగభరితంగా జరిగింది. ఒకనాటి కర్నూలు జిల్లాలో అంతర్భాగమైన (ప్రస్తుతం ప్రకాశం జిల్లా) కంభం మండలం లింగాపురం గ్రామానికి చెందిన అన్నెం కుటుంబీకులందరూ ఆదివారం కలిశారు. అన్నెం ఉల్లక్కి రెడ్డి, అన్నెం నాంచారరెడ్డి కుటుంబాలకు చెందిన నాలుగు తరాల కుటుంబ సభ్యులు దేశ విదేశాల్లో నివసిస్తున్నారు. దశాబ్దం క్రితం కర్నూలులో ఇలాగే కార్యక్రమాన్ని నిర్వహించుకొని పరస్పర ప్రేమానురాగాలు చాటుకున్నారు. రోజంతా ఎంతో సంతోషంగా గడిపారు. ఆత్మీయ కలయికతో పులకించి పోయారు. తాతయ్యా, అమ్మమ్మా, నానమ్మా, పెద్దమ్మా అంటూ ఆత్మీయ పలకరింపులతో పెద్దవారిని ఘనంగా సత్కరించారు.

అందని తాగునీరు

- మరమ్మతులకు గురైన మోటారు
- ఆగిపోయిన నీటిశుద్ధి ప్రక్రియ



పి. లింగాపురంలోని నీటిశుద్ధి కేంద్రం

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. లింగాపురం గ్రామం మారుమూల గ్రామం. నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉందని ఈ గ్రామానికి లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి నీరందించేవారు. ఆ నీరు కూడా సరఫరా కావడం లేదని గతేడాది పీఎంఏజీవై నిధులు రూ.3 లక్షల రూపాయలు వెచ్చించి నీటిశుద్ధి కేంద్రాన్ని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. తక్కువ ధరకే సురక్షిత మంచినీటిని అందించారు. మూడు నెలల కూడా పనిచేయలేదని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్ చేసే మోటార్లు గురయ్యాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఫ్లోరైడ్ నీటినే తాగి నొప్పులు భరించలేకపోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు తరిగోపుల నుంచి ప్రైవేటు వ్యక్తులు తీసుకొచ్చిన వాటర్‌ట్యాంకు నుంచి నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శివశంకర్ నీటిని ఫిల్టర్ చేసే మోటారు మరమ్మతులకు గురైందని, పంచాయతీలో డబ్బులు లేకపోవడంతో మరమ్మతులు చేయలేదని చెప్పారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి: కలెక్టర్


విద్యార్థినులతో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. పట్టణంలోని బొమ్మలసత్రంలోని సమీకృత బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులకు పరీక్షల నేపథ్యంలో విద్యా సామగ్రిని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టుదలతో చదవాలని సూచించారు.

'మైనార్టీల ఆర్థిక పురోగతికి రుణాలు'

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనార్టీల ఆర్థిక పురోగతికి రుణాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చామని, భవిష్యత్తులో అందరికి రుణాలు వస్తాయని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని పద్మావతినగర్‌లోని ఆదివారం మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందన్నారు.

'ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి'

గడివేముల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని కర్నాటక రాష్ట్రం శ్రీమఠం పీఠాధిపతులు శంకరాచార్య, స్వయంప్రకాశ సచ్చితానందసరస్వతి స్వామిజీ అన్నారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రవచనాలను, సూక్తులను ప్రబోధించారు. ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని అన్నారు. స్వామివారిని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, గడివేముల మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి తదితరులు కలిసి ఆశీర్వచనాలను తీసుకున్నారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి హైస్కూల్ కరస్పాండెంట్ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుబ్రా మసీదులో వైద్య శిబిరం

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుబ్రా మసీదులో ఆదివారం ఇమాంలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇమాంల సంఘం అధ్యక్షుడు అంజ్ బాషా సిద్దికి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ ప్రారంభించారు. ఈసీజీ, షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, ఇండస్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జహంగీర్ బాషా, ఉబేదుల్లా ఖాన్ తదితరులను నిర్వాహకులు సన్మానించారు.

'కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి'

పాములపాడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ డిమాండ్ చేశారు. ఆదివారం పాములపాడులో కౌలురైతు శివప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.30 లక్షలు పరిహారం చెల్లించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ నాయకులు పెద్దరామయ్య, రవికుమార్, బాషా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

5న నూతన కమిటీ ఎన్నిక

సున్నిపెంట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం పరిధిలోని శ్రీ విరాట్ విశ్వకర్మ నిత్యాన్నదాన సమాజం నూతన కమిటీని మార్చి 5వ తేదిన ఎన్నుకోనున్నట్లు విశ్వ బ్రాహ్మణ సంఘం జాతీయ నాయకులు లాల్ కోటి వెంకటాచారి తెలిపారు. ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి నూతన కమిటీ ఎన్నుకోవాల్సి ఉందని చెప్పారు. అయితే గత 8 సంవత్సరాలుగా ఎలాంటి ఎన్నికలు లేకుండా ప్రస్తుత కమిటీ కొనసాగుతోందని తెలిపారు.

'చందాలు వసూలు చేస్తే చర్యలు'

కొత్తపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరం పేరు చెప్పి చందాలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో రామలింగారెడ్డి హెచ్చరించారు. సంగమేశ్వరంలో ప్రైవేటు వ్యక్తులు ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారని గానీ, అన్నదానం చేస్తున్నామని గానీ చెబితే నమ్మవద్దని సూచించారు. ఇటీవల కొందరు కరపత్రాలు తయారు చేయించి భక్తుల వద్దకు చందాల కోసం వెళ్తున్నట్లు తెలిసిందన్నారు. ఎవరైనా చందాల కోసం వస్తే దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

17న ఆత్మలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక వేడుకలను ఈ నెల 17వ తేదిన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ వేడుకలో భాగంగా ఆలయంలో గణపతి, ఉభయమూర్తులకు స్వస్త పుణ్యాహవచనం, పంచామృత, పంచగవ్య, బిల్వపత్ర అభిషేకం, భక్తులచే సామూహిక అభిషేకాలు నిర్వహించనున్నారు. అలాగే స్వామివారికి విశేష అలంకరణ చేపట్టి మంగళ హారతులను నివేదించనున్నారు. అంతేకాకుండా రాత్రి 7.15గంటల సమయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆ తర్వాత స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించనున్నారు. భక్తులచే అల్పాహార వితరణ చేపట్టనున్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలను చూపుతున్న విద్యార్థులు

పాణ్యం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగా పోటీలలో ప్రతిభ సాధించినట్లు హెచ్‌ఎం మేరీ సునీత పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆదివారం కర్నూలు జిల్లా పెదపాడు గ్రామం వేదాన్షి పాఠశాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా ప్రీమియర్ లీగ్-2025లో అండర్ 14 విభాగంలో కె. లక్ష్మీనరసింహ ప్రథమ స్థానం, యు. నాగకార్తీక్ ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. అండర్-17 విభాగంలో కె. మనోజ్ ప్రథమస్థానం, బి. చరణ్ సాహిత్ ద్వితీయస్థానం సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను అభినందించారు.

బుక్కాపురంలో కార్డన్ సెర్చ్

మహానంది, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల్లో ఆదివారం ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. బుక్కాపురం సమీపంలోని పెట్రోల్ బంకు పక్క షాపులో చాకలి రవి విక్రయించడానికి సిద్ధంగా ఉంచుకున్న 18 మద్యం బాటిళ్లు, తిమ్మాపురంలో అచ్చయ్య వద్ద 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే బుడ్డాకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న మహానంది ఆలయ ఈవో

మహానంది, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కుటుంబ సమేతంగా రావాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి తొలి ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఆదివారం వేల్పనూరు లోని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో ఈవో తో పాటు వేదపండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు కలిసారు. శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. తహసీల్దార్ రమాదేవి, ఏఈవో ఎర్రమల్ల మధు, ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, అర్చకులు శంకరయ్యశర్మ పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మహా శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఈవో నాగప్రసాద్‌కు సూచించారు. ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఓంకారంలో జరిగే గంగా ఉమా జమేత సిద్ధేశ్వర స్వామివార్ల శివరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆదివారం ఈవోతో పాటు అర్చకుడు మల్లికార్జున ఎమ్మెల్యే బుడ్డా చేత ఆవిష్కరింపజేశారు. అలాగే ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. టీడీపీ నాయకులు టీజీపీ ప్రాజెక్టు వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, ఈశ్వరరెడ్డి, చెన్నారెడ్డి, శంకర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

'రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీలు, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ ఈబీసీలు ఈ నెల 12వ తేదీలోగా బీసీ ఆర్థిక చేయూత రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో దస్తగిరి ఆదివారం తెలిపారు. ముఖ్యంగా చదువుకుని ఎలాంటి ఉపాధి లేక ఇంటి వద్ద ఉన్న నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారంతా ఆధార్, రేషన్ కార్డు, కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మీసేవ కేంద్రాలు, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

ముగిసిన చర్చి వార్షికోత్సవం


ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల సాయిబాబానగర్‌లో గిప్సన్ కాలనీలో కొలువైన తెలుగు బాప్టిస్టు చర్చి 57వ వార్షిక వేడుకలు ఆదివారం ముగిశాయి. చర్చి పాస్టర్ సీహెచ్ విజయభాస్కర్ దైవ సందేశం ఇచ్చారు. వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు, దైవ ఆరాధనలు, భక్తి పాటలు, చిన్నారులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు బాప్టిస్టు చర్చి ప్రెసిడెంట్ రాజు ఇమ్మానియేల్, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి కృపవరం, కార్యవర్గ సభ్యులు సాల్మన్‌రాజు, ఆనంద్, సుధీర్ కుమార్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

'విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి'


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథులు, నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ముఖ్య అతిథులు సూచించారు. దివంగత ఉపాధ్యాయులు ఎంఆర్ గోవిందరెడ్డి, దివంగత ఆర్‌సీ కంబగిరి రాజు జ్ఞాపకార్థం జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలను ఆదివారం నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించారు. చిత్రకారులు చిత్తలూరి రాంప్రసాద్, చింతలపల్లె కోటేష్ అధ్యక్షతన నిర్వహించిన పోటీలకు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదన్‌రావు, శ్రీనిధి రఘువీర్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. దివంగత నందమూరి తారక రామారావు చిత్రాన్ని పోటీ అంశంగా ఇచ్చారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా గురురాఘవ కార్తీక్‌కు రెండు గ్రాముల బంగారు పతకం, గణేష్‌కు 20 గ్రాముల వెండి పతకం, రాగచైత్ర కు 10గ్రాముల వెండి పతకం, పది మంది విద్యార్థులకు జ్యూరీ అవార్డులతో పాటు, ప్రశంసా పత్రాలు, అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో లిఖిత్ రాయల్‌కు 20 గ్రాముల వెండి, రెండో బహుమతిగా కావ్యశ్రీకి 10గ్రాముల వెండి పతకం అందజేశారు. నిర్వహకులు ముఖ్య అతిథులను, చిత్రకారులను ఘనంగా సన్మానించారు. డ్రాయింగ్ టీచర్లు వెంకటేశ్వర్లు, రంగనాథ్, వెంకటేశ్వరరాజు, రామిరెడ్డి, ప్రభాకర్, ప్రగతి, రాముడు, సుంకన్న, వెంకీ, ఓబులేసు, విజయ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

పాణ్యం: నంద్యాలలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీలలో ప్రభుత్వ పాఠశాలలో విభాగంలో పాణ్యం మోడల్ పాఠశాలకు చెందిన లిఖిత్ రాయల్ ప్రథమ స్థానం సాధించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీరేష్ తెలిపారు. విద్యార్థికి ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అల్ మేవా డైరీని ఆవిష్కరించారు. వివిధ శాఖల్లో పనిచేస్తే మైనారిటీ ఉద్యోగులకు రంజాన్ నెలలో గంట ముందు కార్యాలయాల నుంచి వెళ్లేలా అనుమతి ఇప్పించాలని అల్ మేవా రాష్ట్ర అధ్యక్ష, గౌరవాధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ బాషా, ఎస్ఎండీ అబులైస్, అబ్దుల్ సమద్ తదితరులు మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ టి.తులసి రెడ్డి, ఉర్దూ డీఐ అస్మద్దున్, మనియార్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా వినతుల స్వీకరణ

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మొదటి సమావేశానికి హాజరైన అధికారులు సోమవారం ఉదయం 10.30 గంటలకు సుండిపెంటలో నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (ఐటీడీఏకి సంబంధించినది) కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు శ్రీశైల దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూంలో శివరాత్రి మహోత్సవాల నిర్వహణపై మంత్రుల బృందం సమీక్షించే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. మిగిలిన అధికారులంతా జిల్లా కేంద్రంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఉదయం 9.30గంటలకు హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

చర్చిలో ఇరువర్గాల ఘర్షణ

నందికొట్కూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని ఓ చర్చి స్థల వివాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు చోటు చేసుకుంది. పట్టణంలోని మారుతి నగర్‌లోని చర్చి స్థల వివాదంపై రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దిగారు. ఆదివారం ఒక వర్గం మరో వర్గానికి చెందిన కుర్చీలను ధ్వంసం చేయగా.. మరో వర్గానికి చెందిన బండలను ఈ వర్గం వర్గం వారు ధ్వంసం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య చెరేగిన ఘర్షణ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. దీంతో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

హజ్ యాత్రికులకు అవగాహన


అతిథులను సన్మానించిన కమిటీ సభ్యులు

నంద్యాల మున్సిపాలిటీ/ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నుంచి హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులకు హజ్ కమిటీ ఆదివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. స్థానిక నేషనల్ కళాశాలలో జరిగిన ఈ శిక్షణలో 250 మంది ఉమ్మడి కర్నూలు జిల్లా హజ్ యాత్రికులు పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నంద్యాల జిల్లా హజ్ సేవా సమితి అధ్యక్షుడు డా. ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హజ్ యాత్రికులు పలు సౌకర్యాలు, రాయితీలు కల్పించాయన్నారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గౌస్‌పీర్ హజ్ యాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకు పాటించాల్సిన నియమ నిబంధనలను శిక్షణలో పాల్గొన్న యాత్రికులకు వివరించారు. గత 20 సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి జిల్లా హజ్ సేవా సమితి ద్వారా సేవలు అందిస్తున్నట్లు ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం


ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు వైష్ణవ కరుణానిధి హాజరై జెండాను ఆవిష్కరించి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, చాంద్‌బాషా, భార్గవరామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, దేవనాల శ్రీను, కల్కి శ్రీనివాసులు, రాంపుల్లారెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో బీజేపీ సంబరాలు


టెంకాయలు సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

సున్నిపెంట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా శ్రీశైలంలో ఎన్‌డీఏ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందోత్సాహంతో విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. బీజేపీ శ్రీశైల మండల అధ్యక్షుడు చదువుల శ్రీను, కార్యకర్తలు ఆలయ ప్రధాన ద్వారం వద్ద కొబ్బరికాయలు సమర్పించారు. ఎన్‌డీఏ కూటమి నాయకులు ఉండవల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఎం

నందికొట్కూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడే నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని 8వ వార్డులో ఇళ్లు లేని వారికి ఇంటి స్థలాల కోసం ఆదివారం అర్జీలు సేకరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని నిరుపేదలకు రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో, మూడు సెంట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలన్నారు. దీనికి సంబంధించిన వాటిలోని పేదల చేత అర్జీలను పూర్తి చేయించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సోమవారం పట్టణంలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. షబ్బీర్, గోకారి, శేష నాయుడు, పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్టీ పునరుద్ధరణపై అసెంబ్లీలో చర్చించాలి'


ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై ప్రభుత్వంతో చర్చించాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడు గుజ్జుల గౌరీశ్వరనాయుడు కోరారు. అనంతరంపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో వాల్మీకి బోయలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యకు పరిష్కారం చూపేందుకు ఆయన మద్దతు తెలపాలని కోరారు. ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి, తగిన న్యాయం జరిగేలా ప్రభుత్వం వద్ద తీసుకెళ్లేందుకు తన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు గౌరీశ్వరనాయుడు తెలిపారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగుల మధ్య ఐకమత్యానికి క్రీడలే ప్రతీకగా నిలవాలనే ఉద్దేశంతో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా క్రీడాపోటీలను ప్రారంభించారు. ఆదివారం వెంకటేశ్వరపురం సమీపంలో గల ఎస్డీఆర్ స్కూల్ గ్రౌండ్‌లో ఆళ్లగడ్డ, డోన్ సబ్ డివిజన్ల మధ్య, మినిస్టీరియల్ స్టాఫ్, జిల్లా సాయుధ బలగాల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పాల్గొని క్రీడామైదానంలో సిబ్బందితోపాటు బౌలింగ్, బ్యాటింగ్, ఫిల్డింగ్ చేస్తూ క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ క్రీడాపోటీల్లో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ఈ ఐకమత్య క్రీడా పోటీల్లో ఆళ్లగడ్డ, నంద్యాల, ఆత్మకూరు, డోన్ సబ్ డివిజన్లకు చెందిన పోలీసులు, సిబ్బంది, జిల్లా సాయుధ బలగాల సిబ్బంది, హోంగార్డులు తదితర విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడా పోటీల్లో జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

'భక్తులకు సౌకర్యాలు కల్పించాలి'



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా జిల్లాలోపి అన్ని శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని సౌకర్యాలు కల్పించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. నంద్యాలలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ అన్ని శైవ క్షేత్రాలలో ఉచిత దర్శనాలు కల్పించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శ్రీశైలం, మహానంది క్షేత్రాలలో ప్రభుత్వం, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు భక్తుల నడిచి వెళ్లే ప్రయాణికులకు మార్గమధ్యంలో షెల్టర్లు, తాగునీటి, భోజన, వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అడవిలో వెళ్తున్న భక్తుల నుంచి, భక్తుల వాహనాల నుంచి అక్రమ వసూళ్లను ఆపివేయాలని, బస్సుల సదుపాయం కల్పించడం, బస్సులలో చార్జీలు పెంచకుండా సాధారణ చార్జీలు వసూలు చేయాలన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు శేషసాయి, నంద్యాల ప్రఖండ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

రహదారి గుంతలమయం


బావాపురం గ్రామ శివారులో గుంతలమయంగా మారిన రోడ్డు

కొత్తపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బావాపురం గ్రామ శివారులో గుంతలమయమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు. బావాపురంలోని తాగునీటి ట్యాంకు నుంచి వస్తున్న నీరు గ్రామశివారులోని రహదారిపై పారుతుండటంతో గుంతలమయమై ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల, మూడు చక్రాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ గ్రామంలోని రహదారి గూండానే సుమారు 20 గ్రామాల ప్రజలు నిత్యం ఆత్మకూరు పట్టణానికి పలు అవసరాల నిమిత్తం వస్తూ వెళ్తుంటారు. అంతేగాకుండా ఇదే రహదారిపై నిత్యం ప్రజాప్రతినిధులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలకు వెళ్లే భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి నిత్యం ఏదో ఒక సమయంలో కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక అభిషేకం

- భారీగా తరలివచ్చిన భక్తులు


స్వామి వారి దర్శనం కోసం భారీగా తరలి వచ్చిన భక్తులు


పూజ చేస్తున్న అర్చకుడు కిడాంబి వేణుగోపాలాచార్యులు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): లక్ష్మీ నరసింహస్వామి పార్వేట పల్లకి ఉత్సవంలో భాగంగా ఆదివారం సర్వాయిపల్లె గ్రామంలో స్వామి వారికి గ్రామ సమీపంలోని కోనేటి వద్ద ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేశారు. స్వామివారి పార్వేట ఉత్సవం ప్రారంభం అయ్యి నేటికి 26 రోజులు గడిచింది. గ్రామంలో ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో నవకలశ తిరుమంజనం చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామస్థులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం స్వామి వారికి వేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


పూజల్లో పాల్గొన్న ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు

డోన్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయిబాబా మందిరంలో ఉదయం జరిగిన ప్రత్యేక హోమాలు, అభిషేక కార్యక్రమాల్లో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి సతీమణి మల్లేశ్వరమ్మ కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 13న సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరుగుతుందని సభ్యులు తెలిపారు.

ప్రత్యేక రైలు బోగి ఏర్పాటు చేయాలి

డోన్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు టికెట్‌లో రాయితీతో పాటు ప్రత్యేక బోగిని ఏర్పాటు చేయాలని రైతు సంఘం గౌరవాధ్యక్షుడు కోయలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం డోన్ రైల్వే స్టేషన్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు నరసింహులు, నక్కి శ్రీకాంత్ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భూమా శోభా నాగిరెడ్డి వెటర్నరీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఆళ్లగడ్డలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల క్రీడా మైదానంలో టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల, కర్నూలు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించారు. ఇందులో భూమా శోభానాగిరెడ్డి వెటర్నరీ కళాశాలకు చెందిన క్రీడాకారులు జగన్, ఐజాక్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి పట్టణంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు.

'టీడీపీ పాలనలోనే ప్రభుత్వ హాస్టళ్లు మెరుగు'

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ హాస్టళ్లు టీడీపీ పాలనలోనే మెరుగుపడుతున్నాయని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరు బోధనం బాలనాగన్న అన్నారు. ఆదివారం కోవెల కుంట్ల పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టలు విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో వార్డెన్ లేక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా కార్యదర్శి వడ్డె సుబ్బరాయుడు, మద్దిలేటి, ఓబులేసు, బాలకమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళలపై దాడి

బనగానపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన నాగ విజయుడు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన సమీప బంధువులైన నాగపుల్లమ్మ, పల్లవిలపై దాడి చేశాడు. నాగపుల్లమ్మ, పల్లవిలు తమ షెడ్డులో గేదెలకు పాలు పితుకుతుండగా నాగవిజయుడు వచ్చి తన పొలంలో నీరు పారిస్తావా అంటూ నానా దుర్భాషలాడాడు. అనంతరం ఇరువురి మహిళలపై దాడి చేయగా నాగపుల్లమ్మకు గాయాలయ్యాయి. అలాగే పల్లవి తల్లిదండ్రులైన మూగసుబ్బమ్మ, సుబ్బరాయుడులు తమ కుమార్తెపై దాడి చేస్తావా అంటూ నాగ విజయుడును అడగడానికి వెళ్లగా నాగవిజయుడు మరోసారి దాడి చేశాడు. ఇష్టమొచ్చినట్లు రోడ్డుపై పడేసి దారుణంగా కొట్టి గాయాలకు గురి చేశాడు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు నాగ విజయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

హార్వెస్టర్ కింద కూర్చున్న మహిళకు గాయాలు

సంజామల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హార్వెస్టర్ కింద కాసేపు సేద తీరదామని కూర్చున్న మహిళ గాయాలపాలైన ఘటన మండలంలోని వసంతాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన భూలక్ష్మి లాయర్ మధుసూదన్ రెడ్డి పొలంలో శనగ పంట నూర్పిడికి వెళ్లింది. తోటి కూలీలతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం హార్వెస్టర్ కింద నీడ ఉండటంతో కాసేపు సేదతీరదామని కూర్చుంది. భోజనం అనంతరం డ్రైవర్ హార్వెస్టర్ కదిలించడంతో కూర్చున్న భూలక్ష్మి హుటాహుటిన బయటికి వెళ్లే ప్రయత్నం చేసింది. ఆ క్రమంలో భూలక్ష్మి తలకు, చేతులకు గాయాలయ్యాయి. బంధువులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బాధితురాలిని నంద్యాలకు తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన కోనేటి వెంకటేశ్వర్లు (50) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నెల 4న పేరూరు గ్రామంలో ధనిరెడ్డి ప్రహ్లాదరెడ్డి అనే రైతు పంట పొలంలో పని చేసేందుకు వెళ్లి ట్రాక్టరు నుంచి కిందపడ్డాడు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ అనుమతితోనే మట్టి తవ్వకాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలం కోటకొండ గ్రామంలోని కల్యాణి(కోలన్న) చెరువులో ప్రభుత్వ అనుమతులతో నిబంధనల మేరకే మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని టీడీపీ రుద్రవరం మండల కన్వీనర్ లింగం వెంకట రంగనాయకులు, మాజీ సర్పంచ్ పోలా గురుమూర్తి అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు రామనాథరెడ్డి, యువరాజు, రాజారావు పాల్గొన్నారు.


సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

- పదో తరగతి విద్యార్థుల్లో ఆనందం
- ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వంద రోజుల ప్రణాళికతో కసరత్తు


చాగలమర్రిలో పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం

చాగలమర్రి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమైన పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. పరీక్షల గడువు సమీపిస్తుండటంతో అదనపు తరగతులతో పాటు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. తాజాగా పదోతరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం అమలుకు శ్రీకారం చుట్టింది. ఈనెల 2 నుంచి ఈ విధానం అమలు వచ్చింది. మార్చి 10వరకు దీనిని కొనసాగించనుంది. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం



విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రణాళిక ప్రకారంగా బోధన చేస్తున్నారు. సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు వల్ల పూర్తి సమయం చదువుకు కేటాయించవచ్చు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించాలి.

- జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలో పదోతరగతి విద్యార్థులు 28,294 మంది ఉన్నారు. ఇందులో బాలికలు 12,085, బాలుర 13,209 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఈ విద్యార్థులు ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధపడుతున్నారు. మార్చి 17నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చే సేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెల రెండవ శనివారం, ప్రతి ఆదివారంతో పా టు ఇతర సెలవుల్లో రో జుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నా రు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంట ల వరకు, మధ్యా హ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక బోధన కొనసాగిస్తున్నారు. దూ ర ప్రాంతాల నుంచి వచ్చే కొంత మంది వి ద్యార్థులు క్యారేజిలు తెచ్చుకోలేకపోవడంతో మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడేవా రు. కూటమి ప్రభుత్వం తాజాగా సెలవు రోజుల్లోను మధ్యాహ్న భోజనం అమలు చేస్తుండటంతో తమ ఆకలి బాధలు తప్పాయని పలువురు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సైతం వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పట్టుదలతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇస్తూ విద్యాబోధనకు కృషి చేస్తున్నారు.

గ్రూపు రాజకీయాలు సహించం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

డోన్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రూపు రాజకీయాలు సహించేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. ఆదివారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ భవనంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై అభిరుచి మధు మాట్లాడుతూ బీజేపీలో అందరు ఐకమత్యంతో పని చేయాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో స్థానిక ఎన్నికల్లో మనకు కేటాయించిన స్థానాల్లో సత్తా చాటేందుకు సంసిద్ధంగా ఉండాలని అన్నారు. పార్టీలో గ్రూపులు కట్టకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పని చేయాలన్నారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో బీజేపీలో కోఆర్డినేటర్‌గా ఉన్న వడ్డె మహారాజ్‌ను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నామని ప్రకటించారు. బీజేపీ ప్రతిష్ఠకు భంగం కలిగించే పనులు చేస్తే సహించేది లేదని అటువంటి వారిపై పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గం నాయకులు ఆంజనేయులు, రవికుమార్, సుధాకర్, నటరాజ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌లో అక్రమాలను అరికట్టాలి: సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రేషన్‌లో అక్రమాలను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యుడు సుంకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ డోన్ కేంద్రంగా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఏ విధంగా జరిగాయో.. అదే తప్పులను కూటమి ప్రభుత్వం చేస్తూ పోతుందన్నారు. రేషన్ బియ్యం దందాను అరికట్టాలని, విచ్చలవిడిగా అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై పీడీ యాక్టును నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు నారాయణ, మోట రాముడు ఉన్నారు.

- ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం చేపట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ, సుంకయ్య, మోటరాముడు కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.
- అదే విధంగా పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో డోన్ కొత్తపేటలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామ్మోహన్, లక్ష్మీదేవి, ప్రమీల తదితరులు ఉన్నారు.

యాగంటి క్షేత్రంలో ఆక్రమణలు


కాల్వను దాటి సీసీ రోడ్డును సైతం ఆక్రమించిన దుకాణదారులు

బనగానపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయం బయట ప్రవేటు దుకాణాలు నిర్వహించుకుంటున్న వ్యక్తులు యాగంటి ఆలయానికి చెందిన కాల్వను దాటి ముందుకు దూసుకు వస్తున్నారు. గతంలో కాల్వ ఆవల దుకాణాలు ఉండేవి. అయితే రోజు రోజుకు ముందుకు వస్తూ సీసీ రోడ్డుమీదకు దుకాణదారులు వచ్చారు. దీని వల్ల నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు చెత్తాచెదారాన్ని, అపరిశుభ్రమైన నీటిని మంచి నీటి కాల్వలో పడవేస్తూ అపరిశుభ్రం చేస్తున్నారు. నిత్యం ఇబ్బందులు కలిగిస్తున్న ప్రైవేట్ దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు ఆలయ అధికారులకు, పోలీస్ సిబ్బందిని కోరుతున్నారు.

రాష్ట్రాభివృద్ధికి చేయూత ఇవ్వండి : మంత్రి బీసీ


మంత్రికి పుస్తకాలు ఇస్తున్న డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్

బనగానపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టి రాష్ట్రాభివృద్ధికి చేయూత ఇవ్వాలని హిందూస్థాన్ గ్రూప్‌ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. ఆదివారం బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆనంద్ జాకబ్ వర్గీస్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిశారు. ఇరువురు పెట్టుబడులపై చర్చించారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి కోరారు.

నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం

చాగలమర్రి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వైద్యులు ఇమ్రాన్ తెలిపారు. ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 సంవత్సరాలు లోపుగల విద్యార్థులకు ఆల్‌బెండజోల్ గుళికలను వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.

పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

చాగలమర్రి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు అనాథాశ్రమంలో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి ఆంజనేయరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ సంఘ నాయకులు రషీద్‌ఖాన్, ఓబుళపతి, మౌలాలి, రవిప్రకాష్‌రెడ్డి, నబీసాహేబ్, దాదాపీర్, రామకృష్ణ, రవిశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయపాల్, అనిఫ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాన్ని కాపాడుకోవాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయాన్ని కాపాడుకోవాలని శివరామానంద ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి అన్నారు. ఆదివారం చాగలమర్రి పాత శివాలయంలో భజగోవిందం ప్రవచనాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మప్రచారం అందరి బాధ్యతగా తీసుకోవాలని అన్నా రు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, శివస్వాములు, మహిళలు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన యాగంటి క్షేత్రం


యాగంటిలో క్యూలైన్‌లో నిలిచిన భక్తులు

బనగానపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రెండు రోజులు సెలవుదినాలు రావడంతో వివిధ ప్రాంతాలనుంచి భారీగా యాగంటి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. క్యూలైన్‌లో భక్తులు యాగంటి బసవేశ్వరున్ని, యాగంటి ఉమామహేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వెంకటేశ్వరగవిని దర్శించుకొని వెంకటేశ్వరస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

డోన్ టౌన్, ఫిబ్రవరి 09 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటకు చెందిన షేక్ ఖాజాబాషా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆవాజ్ కమిటీ జిల్లా నాయకులు చిన్న రెహిమాన్, అక్బర్ బాషా కోరారు. ఆదివారం ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్తపల్లి సమీపంలో విద్యుదాఘాతానికి గురై ఖాజాబాషా మృతి చెందాడన్నారు. కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. ప్రభుత్వమే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మస్తాన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ గర్జన సభను విజయవంతం చేయాలి

అవుకు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ఈనెల 23న నిర్వహించనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభను విజయవంతం చేయాలని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం కోరారు. ఆదివారం పట్టణంలో జైభీమ్ రాష్ట్ర కన్వీనర్ ఆవుల సుధాకర్ అధ్యక్షతన మాల మహానాడు నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ అనంతరం దేవరత్నం మాట్లాడుతూ మాలల హక్కుల పరిరక్షణ కోసం ఏకతాటిపై నిలవాలన్నారు. కర్నూలు ఎస్టీబీసీ కాలేజీ మైదానంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు మాలలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సంఘం నాయకులు మద్దిలేటి, కటారి ఆదాం, నాగరాజు, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వలసల నివారణే లక్ష్యం

- రమణ, ఉపాధి ఏపీవో



ప్యాపిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలు నివారించడమే లక్ష్యమని ఏపీవో సీవీ రమణ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పథకం కొనసాగుతోందన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏపీవో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి?

జవాబు: మండలంలోని 50 గ్రామాల్లో ఉపాధి పనులు చురుకుగా జరుతున్నాయి. ఎటువంటి పనులు, ఎక్కడ పనులు చేయాలో ముందుగానే గుర్తించి కూలీలకు ఇబ్బందుల లేకుండా ఉపాధి పనులు కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఎంత మంది కూలీలు పని చేస్తున్నారు?

జవాబు: ప్రస్తుతం ఐదువేలకు పైగా కూలీలు పని చేస్తున్నారు. అవసరం ఉన్నవారందకీ పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం.

ప్రశ్న: పనుల నాణ్యతలో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పనుల నాణ్యత విషయంలో రాజీ పడటం లేదు. నిబంధనల ప్రకారమే పనులను చేయిస్తున్నాం. పనుల్లో ఎటువంటి నాణ్యత లోపించిన సిబ్బందిపై చర్యలు తీకుకుంటున్నాం.

ప్రశ్న: ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి కదా?

జవాబు: గతంలో అక్రమాలు జరుగుతున్నది వాస్తవమే. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం అవినీతి, అక్రమాలు జరిగే అవకాశాలు లేవు. ప్రభుత్వం పనుల్లో అక్రమాలను నివారించడానికి కూలీల ముఖ హాజరు విధానాన్ని అమలు చేయడం వలన అక్రమాలకు తావు లేకుండా పోయింది. పొరపాటున ఎక్కడైన అక్రమాలు జరిగినట్లు తెలితే వెంటనే సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నాం.

చెన్నప్ప బాధితులు మమ్మల్ని సంప్రదించాలి

- సీఐ రమేష్ బాబు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పలు భూఆక్రమణలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వటాల గ్రామానికి చెందిన వంకదారి చిన్న చెన్నప్ప బాధితులుంటే పోలీసులను సంప్రదించవచ్చని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొన్ని కేసుల్లో ఇప్పటికే చిన్న చెన్నప్పను అరెస్ట్ చేసి, రిమాండుకు తరలించామన్నారు. పలు గ్రామాల్లో చెన్నప్ప ద్వారా తీవ్రంగా నష్టపోయిన బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇంకా ఎవరైనా ఉంటే సమస్యలను చెప్పుకోవచ్చని తెలిపారు. చట్టరీత్యా బాధితులకు అండగా ఉంటామని సీఐ తెలిపారు.

బెలుం గుహల్లో సందడి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రం బెలుం గుహల్లో సండే సందడి నెలకొంది. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గుహల అందాలను తిలకించారు. దీంతో బెలుం గుహలు సందర్శకులతో కళకళలాడాయి. గుహల ఆవరణంలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహం పర్యాటకులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది.

వర్గీకరణను అడ్డుకుంటాం: మాల మహానాడు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగానికి విరుద్ధంగా అమలు చేయాలని ప్రయత్నిస్తున్న ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కేదం సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం మండలం బెలుం గ్రామంలో ఆయన కర్నూలులో ఈనెల 23న జరిగే మాలల యుద్ధ గర్జన కార్యక్రమంపై సమాలోచన చేశారు. మాల సోదరులు ప్రతి ఇంటికి ఇద్దరు తరలివచ్చి, యుద్ధ గర్జన జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొలిమిగుండ్ల మండల అధ్యక్షులు చిన్నకంబయ్య, సుబ్బరాయుడు, దావీదు, శ్యాముల్, చెన్నయ్య, బా పాల్గొన్నారు.

నేడు బసవేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

శిరివెళ్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్లలో జీర్ణోద్ధరణ చేసిన అన్నపూర్ణ విశాలక్షి సమేత బసవేశ్వర స్వామి ప్రథమ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. అనంతరం పార్వతీ పరమేశ్వర ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం, సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు అన్నదానం చేసినట్లు తెలిపారు.

12వ పీఆర్సీ ప్రకటించాలి

డోన్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని ప్రకటించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎస్ భాను సింగ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్ల సంఘం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో పెన్షనర్ల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నాయకులు సుబ్బరాయుడు, గాలయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి నాయకుడికి సత్కారం

డోన్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి నాయకుడు సీలం భాస్కర్ నాయుడుకు ఘన సత్కారం లభించింది. ఆదివారం సీలం భాస్కర్ నాయుడును కర్ణాటక రాష్ట్రంలోని భావనగిరి జిల్లా హరిహర తాలుకా రాజనహల్లిలో వాల్మీకి మహర్షి గురుపీఠం పీఠాధిపతి ప్రసన్న ఆనందస్వామి జ్ఞాపికను అందజేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే అంశంపై ఆయన పోరాడుతున్నారు.

వైభవంగా ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ ఆత్మీయ సమ్మేళనం

చాగలమర్రి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో ఆదివారం ఎక్కిరాల భరద్వాజ మాస్టార్ ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. ఆళ్లగడ్డకు చెందిన సాయి మాస్టార్ ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు. మహిళలు సామూహికంగా ప్రత్యేక హారతులు ఇచ్చారు. షిరిడిసాయి, భరద్వాజ మాస్టార్ చిత్రపటాలతో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో సాయిసేవ సభ్యులు ప్రసాద్, కాశీ, నవీన్, మహిళలు పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించాలి

రుద్రవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు పెద్దలను గౌరవించాలని ఆటోయాత్రికుడు అబ్దుల్‌గఫార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఆటో యాత్ర చేపట్టారు. ఆటోయాత్రలో భాగంగా వీధుల వెంట పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఇలా చేస్తే సమాజంలో మేలు ఉంటుందన్నారు. శాంతి ఉంటుందన్నారు.

అండగా ఉంటాం

బేతంచెర్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి అన్నారు. ఆదివారం మర్రికుంటలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, వైసీపీ నాయకులుతో కలిసి ఆయన పర్యటించారు. ఎం.పెండేకల్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ దారం వెంకటరెడ్డి ఇటీవల మరణించాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బుగ్గన మధుమోహన్ రెడ్డి, సీతా రామ చంద్రుడు, పుసులూరు మురళీకృష్ణ, తిరుమలేశ్వరరెడ్డి, సర్పంచులు కొడే వెంకటేశ్వర్లు, పరమేశ్వరయ్య, ఎద్దులన్న పాల్గొన్నారు.